సాక్షి
మంచిర్యాల
సోమవారం । 18 । మార్చి । 2024



'పాపిలాన్' పట్టేస్తోంది..
నేర పరిశోధనలో పోలీసులకు మరో ఆయుధం తోడైంది. పాపిలాన్ ఆటోమెటిక్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టంతో నేరస్తుల ఆట కట్టిస్తున్నారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ : 6:28	మంగళ : 4:59

గరిష్టం/కనిష్టం
34.4 /26.3

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఉక్కపోత అధికంగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

అలరించిన కవి సమ్మేళనం

మంచిర్యాలఅర్బన్: జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. కవయిత్రి అడ్డగూరి శ్రీలక్ష్మి నివాసంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కవి విశ్వేశ్వరశర్మ హాజరై మాట్లాడారు. జిల్లా నుంచి పద్య, వచన, గేయ, కవిత్వం, కథా సాహిత్యం, సాహితీ విమర్శలాంటి వివిధ ప్రక్రియల్లో నాణ్యమైన సాహిత్యం వస్తుందని కొనియాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు సుగుణాకర్, సంతోష్, సుజాత, మల్లేశం కవితాగానం అలరించింది.

పెండింగ్ డీఏలు ప్రకటించాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



జిల్లా కార్యవర్గసభ్యులతో జంగయ్య

మంచిర్యాలఅర్బన్: ఎన్నికల కమిషన్ ప్రత్యేక అనుమతితో పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. మంచిర్యాలలో జిల్లా కార్యవర్గం సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా జంగయ్య మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులను చివరి పనిదినం 23న రిలీవ్ చేయాలన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ, సమగ్రశిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రతీనెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించినట్లు సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. పండిట్, పీఈటీలు ఉన్నతీకరించిన 10,479 పోస్టులు వెంటనే స్కూళ్లకు కేటాయించి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రపాణి, రాజావేణు, ఉపాధ్యక్షులు నర్సయ్య, లావణ్య, కోశాధికారి కిరణ్, కార్యదర్శిచంద్రమౌళి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను వేధిస్తున్న దళారులపై చర్య తీసుకోవాలి

పాతమంచిర్యాల: జిల్లాలోని అంగన్‌వాడీ ఉద్యోగులను వేధిస్తున్న దళారులపై చర్య తీసుకోవాలని సీఐటీయూ జిల్లా మాజీ కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు బదిలీలు, పదోన్నతులు వచ్చాయని, ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లు తామే ఇప్పించామని, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వివరించారు. ఈ విషయమై కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, అంగన్‌వాడీ ఉద్యోగుల యూనియన్ (సీఐటీయూ అనుబంధ)జిల్లా అధ్యక్షురాలు భానుమతి, కార్యదర్శి రాజమణి పాల్గొన్నారు.


బెల్లంపల్లిలో జిల్లాస్థాయి క్రికెట్ లీగ్



మాట్లాడుతున్న నిర్వాహకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో జిల్లాస్థాయి క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఏఎంసీ మైదానంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... క్రికెట్ లీగ్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబర్చాలని సూచించారు. ప్రతిభ ఆధారంగా క్రీడాకారులను జిల్లా టీమ్‌కు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఎ.వెంకటేశ్వర్, సీనియర్ కోచ్ జాడి శేఖర్, కోచ్ గౌతమ్, సీనియర్ క్రీడాకారులు వర్మ, మోక్షానందం తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బెల్ట్‌లు సాధించిన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి నంబర్ -2 ఇంక్‌లైన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో కరాటే బెల్ట్ పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీలకు మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల నుంచి 25 మంది హాజరయ్యారు. వీరిలో 12 మంది ఎల్లో, ఆరెంజ్, బ్లూ బెల్ట్‌లు సాధించినట్లు కరాటే సీనియర్ మాస్టర్ విజ్జగిరి రవి ప్రకటించారు. కృతిక విజ్జగిరి, వి.స్పృతిమ (ఎల్లో), జె.రిస్పిత, ఆర్.అన్విత, ఓ. నిత్య, ఎండీ.మదిహ, వి.రిషివర్ధన్, టి.సాకేత్, బి.అశ్రిత్ (ఆరెంజ్), జె.వైష్ణవి, ఎ.సంహిత, టి.అన్వంతిక(బ్లూ) బెల్టులు సాధించారని వివరించారు.

విజయీభవ!



హాల్‌టికెట్లతో పారుపల్లి హైస్కూల్ విద్యార్థులు

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న విద్యార్థులు 9,298
- సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ నం: 7032463114, 9440688034

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు. పరీక్షల్లో ఒత్తిడి.. భయం.. ఆందోళన జయించాలంటే సానుకూలమైన ఆలోచనలు.. ప్రణాళికాబద్ధమైన సంసిద్ధత, ఆత్మవిశ్వాసం, విషయాన్ని సూటిగా స్పష్టంగా వ్యక్తీకరించడం అవసరం. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రా రంభం కానున్నాయి. ఆయా పాఠశాలల్లో పరీక్ష రా సే విద్యార్థులకు ఇప్పటికే ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు. హాల్‌టికెట్ అందజేసి విషెస్ చె ప్పారు. పరీక్షల నిర్వహణపై సీఎస్‌లు డీవోలు, ఇన్విజిలేటర్లతో సమావేశాలు నిర్వహించి నిబంధనలను గుర్తుచేశారు. పది పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 52 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం రెగ్యులర్ విద్యార్థులు 9,298 మంది పరీక్షలు రాయనున్నారు. జీఏహెచ్‌ఎస్ 13 పాఠశాలల నుంచి 431, బీసీడబ్ల్యూఆర్‌ఈఐ 7 పాఠశాలల్లో 487 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఏడు ప్రభుత్వ పాఠశాలల నుంచి 207 మంది పరీక్షలు రాయనున్నారు. 18 కేజీబీవీలకు చెందిన 531 మంది విద్యార్థులు, 100 లోకల్‌బాడీ పాఠశాలల నుంచి 2,949 మంది, 79 ప్రైవేటు పాఠశాలలకు చెం దిన 3,263 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 5 టీఎస్ఎంఎస్‌లకు చెందిన 469 మంది, ఒక టీఎస్ఆర్ఎస్‌కు చెందిన 59 మంది, 9 టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న 677 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. 3 ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 71 మంది పరీక్షలు రాయనున్నారు.

పరీక్షల నిర్వహణకు...

పరీక్షల నిర్వహణకు సీఎస్, డీవో, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విధులు నిర్వహించనున్నాయి. చీఫ్ సూపరింటెండెంట్లు 52, డిపార్ట్‌మెంట్ అధికారులు 52, సిట్టింగ్‌స్క్వాడ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు, 532 మంది ఇన్విజిలేటర్లు, 52 మంది ఏఎస్ఎంలు పరీక్ష కేంద్రాల్లో అందుబాటులో ఉంటారు. పరీక్షల నిర్వహణ సమయంలో విధులు కేటాయించిన సిబ్బంది సమయానికి ఆయా కేంద్రాలకు రావాలని, నిబంధన ప్రకారం ప్రశ్నపత్రాలను స్టోరేజ్ పాయింట్ల నుంచి తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ కేంద్రం వద్ద సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచనలు..

పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలి. పరీక్ష రాసే విద్యార్థులు హాల్‌టికెట్, ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, స్కేల్ తప్పనిసరిగా తీసుకెళ్లేలా చూడాలి. సెల్‌ఫోన్, క్యాలికులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలు తీసుకెళ్లరాదు. పిల్లలకు సరైన పోషకాహారం అందించాలి. ట్రాన్స్‌పరెంట్ వాటర్‌బాటిళ్లు తీసుకెళ్లొచ్చు.

సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్..

పదో తరగతి వార్షిక పరీక్షల కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఏదైనా సందేహాలు, సమాచారం కోసం 7032463114తోపాటు 9440688034 నంబర్లలో సంప్రదించవచ్చు.

నిర్భయంగా పరీక్షలు రాయాలి..

పరీక్ష అనే భయం వీడాలి. సంవత్సరం పాటు నేర్చుకున్న విషయాలను మాత్రమే సమాధాన పత్రంలో రాస్తామన్న భావన ఉండాలి. ఆత్మవిశ్వాసం, ధైర్యంగా పరీక్షలు రాయండి. తల్లిదండ్రులు తమ పిల్లలను టీవీలకు దూరంగా ఉంచాలి. పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవడం మంచిది.

– యాదయ్య, డీఈవో

పోలింగ్ శాతం పెంచేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్, పక్కన రామగుండం సీపీ శ్రీనివాసులు

- జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో రామగుండం పోలీస్ కమిషనర్ ఎ.శ్రీనివాసులు, అదనపు కలెక్టర్లు బి.రాహుల్, సబావత్ మోతిలాల్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రకళ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, మంచిర్యాల ఆర్డీవో వి.రాములుతో కలిసి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికా రులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. లోకసభ ఎన్నికల్లో భాగంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 227 పోలింగ్ కేంద్రాలు, బెల్లంపల్లి నియోజకవర్గం పరిధిలో 227 పోలింగ్ కేంద్రాలు, మంచిర్యాల నియోజకవర్గంలో 287 పోలింగ్ కేంద్రాల చొప్పున మొత్తం 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 741 మంది బూత్ స్థాయి అధికారులు, 74 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంపిణీ, రిసెప్షన్ సెంటర్లు, ఇంటర్మీడియట్ స్ట్రాంగ్ రూమ్‌లను చెన్నూర్‌లోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, బెల్లంపల్లిలోని బజార్ ఏరియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రధాన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఏప్రిల్ 18న లోక్‌సభ ఎన్నికల సంబంధిత గెజిట్ నోటిఫికేషన్ విడుదల, 25వ తేదీలోగా నామినేషన్లు దాఖలు, 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందని వివరించారు. జూన్ 6న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. అప్పటివరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సమీకృత కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ నం.1950తోపాటు కంట్రోల్ రూమ్ నం. 08736-250501ను ఏర్పాటు చేశామని వివరించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఖర్చుల పరిశీలకులు, సహాయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు, వీడియో సర్వేలెన్స్, వీడియో పరిశీలన బృందాలు, అకౌంటింగ్ బృందం, ఎక్సైజ్ బృందం, కంట్రోల్ రూమ్, జిల్లా గ్రీవెన్స్ సెల్, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ, ర్యాంప్ సౌకర్యాలతోపాటు వేసవిని దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్, వాలంటీర్లను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రానికి రాలేని దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేతి పంపులపై శ్రద్ధ ఏది?



బెల్లంపల్లి టేకుల బస్తీలో వృథాగా ఉన్న చేతి పంపు

- నిర్వహణ లేక నిరుపయోగంగా..
- మరమ్మతులు చేయక పనికి రాకుండా పోతున్న వైనం
- పుర ప్రజల నీటి కష్టాలు తీర్చని బోర్లు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బల్దియా అధికారులు

బెల్లంపల్లి: పుర ప్రజల నీటి అవసరాలను తీర్చడం కోసం జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన చేతి పంపులు నీరివ్వక నిరుపయోగంగా మారాయి. వీటి నిర్వహణను అధికారులు, పాలకులు గాలికి వదిలేశారు. వేసవిలో మొక్కుబడిగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో చాలా చేతిపంపులు అలంకారప్రాయంగా ఉన్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి అవసరమైన ప్రతీచోట చేతి పంపులు ఏర్పాటు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేసిన అధికారులు వాటి నిర్వహణను పట్టించుకోవడంలేదు. ప్రస్తుతం ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. మున్సిపాలిటీల్లో నీటి అవసరాలు పెరిగాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా జరగడంలేదు. దీంతో ప్రజలు చేతిపంపులపై ఆధారపడుతున్నారు.

బల్దియాల్లో చేతి పంపుల వివరాలు..

బల్దియా	చేతి పంపులు	రిపేరుకు వచ్చిన బోర్లు	పాడై పోయినవి
మంచిర్యాల	255	24	53
బెల్లంపల్లి	368	113	35
లక్సెట్టిపేట	227	35	15
చెన్నూర్	46	06	00
క్యాతన్‌పల్లి	183	00	00
మందమర్రి	280	32	02
నస్పూర్	324	00	00

వేసవి తీవ్రత పెరిగి..

జిల్లాలో నస్పూర్, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, లక్సెట్టిపేట, చెన్నూర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా మున్సిపాలిటీల్లో ప్రజల నీటి అవసరాల దృష్ట్యా గల్లీకి ఒకటి, రెండు చేతి పంపులు ఏర్పాటు చేశారు. ఒక్కో మున్సిపాలిటీలో వందలాది చేతిపంపులు ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయినా పురాల్లో నీటి కష్టాలు తీరడం లేదు. ఈసారి వేసవి ఆరంభంలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. దీంతో చాలా మంది చేతిపంపులను ఆశ్రయిస్తున్నారు. ప్రతీ మున్సిపాలిటీలో 80 శాతంపైగా చేతిపంపులు సరిగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది.

గాడితప్పిన నిర్వహణ..

చేతి పంపులు చాలా వరకు నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. వీటిపై కనీస శ్రద్ధ చూపించడం లేదు. ప్లాట్‌ఫాంలు లేక, హ్యాండిల్ ఊడిపోయి, చైన్ తెగిపోయి, పైపులకు రంధ్రాలు పడి పనిచేయని పరిస్థితుల్లో ఉంటున్నాయి. ఏడాదికోసారి అతికష్టంగా మరమ్మతులు చేయించి చేతులు దులుపుకుంటున్నారు. తాగునీటి సరఫరా గతంలోకన్నా మెరుగుపడినా, ఇతర అవసరాల కోసం ప్రజలు చేతిపంపులనే ఆశ్రయిస్తున్నారు. శివారు కాలనీలు, కార్మిక కాలనీలలో నివాసం ఉండే ప్రజలకు చేతిపంపులే ఆధారం. మున్సిపల్ కౌన్సిలర్ల ఒత్తిడి మేరకు అక్కడక్కడా చేతి పంపులకు మరమ్మతులు చేయిస్తుండగా, చాలా చేతిపంపులు మరమ్మతుకు కూడా నోచుకోవడం లేదు. బోర్‌వెల్ సామగ్రి కొనుగోలుకు ఏటా నిధుల కేటాయింపు కోసం బల్దియాల్లో తీర్మానాలు చేస్తున్నా వాటిని ఖర్చు చేయడం లేదు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడి చేతిపంపుల నిర్వహణకు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తున్నాం



మున్సిపాలిటీలో చేతి పంపులకు క్రమం తప్పక మరమ్మతులు చేయిస్తున్నాం. నిర్లక్ష్యం ప్రదర్శించడం లేదు. ప్రజలకు నీటి కష్టాలు రాకుండా కొంతమంది సిబ్బందిని నియమించి రోజువారీగా మరమ్మతులు జరిగేలా చూస్తున్నాం .రూ.5 లక్షల అంచనాతో బోర్‌వెల్ సామగ్రి కొనుగోలు చేయాలని కౌన్సిల్‌లో తీర్మానం చేశాం. త్వరలోనే సామగ్రి కొనుగోలు చేసి ప్రతీ చేతిపంపునకు మరమ్మతు చేయిస్తాం.

– జి.మల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి


బీజేపీ చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

బెల్లంపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్ – న్యూడెమోక్రసీ) బెల్లంపల్లి డివిజన్ కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జాతీయ, దేశభక్తి పేరుతో బీజేపీ పార్టీ గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిందన్నారు. ఈసారి కూడా అదే నినాదంతో మరోసారి అధికారం చేపట్టేందుకు యత్నిస్తోందని పేర్కొన్నారు. స్విస్ బ్యాంకు నుంచి నల్లధనాన్ని తీసుకువచ్చి దేశంలో ప్రతీ కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేదని వివరించారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచి పెట్టడంలో మోదీ సర్కారు ముందంజలో నిలిచిందని విమర్శించారు. కార్మిక చట్టాలను కేంద్రం నిర్వీర్యం చేసిందని, ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు, అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని తెలిపారు. దేశంలో విచ్చల విడిగా మతతత్వ దాడులు జరుగుతున్నాయని, మైనార్టీలు, దళితుల, ప్రశ్నించే గొంతుకలపై దాడులు చేస్తున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు పోరుకు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి, ఇఫ్టూ నాయకులు రాజు, పీవైఎల్ నాయకుడు మనోహర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరాలి




మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్

బెల్లంపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లిలో ఈసారి బీజేపీ జెండా ఎగరాలని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి ఆగర్వాల్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దేశం మొత్తం నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావాలని కోరుకుంటోందని తెలిపారు. అందులో భాగంగా పెద్దపల్లిలో సైతం బీజేపీని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి, నియోజకవర్గ ప్రభరి అన్నపూర్ణ సుదర్శగౌడ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, బీజేపీ జిల్లా కార్యదర్శులు రజిని, కోయిల్‌కార్ గోవర్ధన్, అసెంబ్లీ నియోజకవర్గంలోని బీజేపీ మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల ప్రకారం పని చేయాలి

- లైసెన్స్ గన్స్ స్వాధీనం చేసుకోవాలి
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టాలి
- రామగుండం సీపీ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు, హాజరైన ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు

మంచిర్యాలక్రైం: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని, ఎన్నికల నియమావళి ప్రకారం అందరూ పని చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న పోలీస్ అధికారులకు ఎన్నికల నియమావళిపై కమిషనరేట్‌లో ఆదివారం అవగాహన కల్పించారు. సీపీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. నియమావళిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ప్రతీ ఎన్నికల్లో కొత్తకొత్త సవాళ్లు ఎదురవుతాయని వాటిని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకరావాలని తెలిపారు. నేర చరిత్ర ఉన్నవారు, రౌడీ షీటర్లు, ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి జాబితా సిద్ధం చేయాలని సూచించారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. ఎన్నికల సమయంలో జైలు నుంచి విడుదలైన వారి వివరాలు సేకరించి వారిపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో లైసెన్స్ గన్స్ స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. వారం రోజులు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఏఎస్సైలు, హెచ్‌సీలు, పీసీలకు ఎన్నిక విధులపై ప్రత్యేక శిక్షణ ఇస్తామని వెల్లడించారు. పోలీస్ అధికారులందరూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని, 24/7 అప్రమత్తంగా ఉండాలని వివరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసేవారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏసీపీలు, సీఐలు, ఎలక్షన్‌సెల్ సీఐలు పాల్గొన్నారు.

మిగిలింది రెండు వారాలే..

- వార్షిక లక్ష్యం 70 మిలియన్ టన్నులు
- సాధించింది 66.1 మిలియన్ టన్నులు
- సాధించాల్సింది 3.9 మిలియన్ టన్నులు

శ్రీరాంపూర్: సింగరేణి వార్షిక ఉత్పత్తి లక్ష్యం సాధనకు ఇంకా రెండు వారాలే మిగిలింది. 2023–24 ఆర్థిక సంవత్సరం ఈనెల 31తో ముగియనుంది. ఈ ఏడాది కంపెనీ 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రస్తుతం లక్ష్యానికి చేరువగా ఉంది. దీంతో మార్చి 31 నాటికి వంద శాతం సాధించడానికి అధికారులు శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకు వార్షిక లక్ష్యంలో 66.1 మిలియన్ టన్నులు సాధించింది. మార్చి 31 నాటికి ఇంకా 3.9 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించాల్సి ఉంది. దీని కోసం కంపెనీ డైరెక్టర్లు ఎప్పటికప్పుడు ఏరియాల జీఎంలతో రోజువారీగా సమీక్షలు చేస్తున్నారు. మార్చి 31 నాటికి 70 మిలియన్ టన్నులు ఎలాగైన సాధించాలని ఆదేశిస్తున్నారు. రోజువారీగా లక్ష్యాల సాధనకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు. అవకాశం ఉన్న మేరకు బొగ్గు ఉత్పత్తి పెంచడం కోసం పక్షం రోజులుగా ఏరియా అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఓసీపీలపై ప్రత్యేక దృష్టి సారించారు. స్టాక్ కోల్‌ను కూడా ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే మార్చి 15 నాటికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 66.6 మిలియన్ టన్నులు కాగా, 66.1 మిలియన్ టన్నులు సాధించింది. 99 శాతం ఉత్పత్తి నమోదైంది.

రోజుకు 2.45 లక్షల టార్గెట్..

కంపెనీ నూరు శాతం వార్షిక లక్ష్యాన్ని సాధించాలంటే ఇంకా మిగిలి ఉన్న రెండు వారాల్లో రోజుకు 2.45 లక్షల టన్నులకు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి చేయాలి. ప్రతీరోజు ఈ మొత్తం సాధిస్తే 70 మిలియన్ టన్నుల లక్ష్యం సాధ్యమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. బొగ్గు రవాణా కూడా ఇంతే మొత్తంలో జరగాల్సి ఉంది.

రూ.37 వేల కోట్ల టర్నోవర్..

ఇదిలా ఉంటే ఈ సంవత్సరం కంపెనీ రూ.37 వేల కోట్ల టర్నోవర్ సాధించినట్లు సీఎండీ ఎన్.బలరాం తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం రూ.33 వేల కోట్లు సాధించింది. గతేడాదితో పోలిస్తే 12 శాతం వృద్ధిని కంపెనీ నమోదు చేసింది. ఇదిలా ఉంటే నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాన్ని ఎల్లందు డివిజన్ ఇప్పటికే అధిగమించింది. 111 శాతం ఉత్పత్తి సాధించింది. కంపెనీ ఉత్పత్తి చేసిన 66.1 మిలియన్ టన్నుల్లో 65.25 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా చేశారు.

క్లుప్తంగా

రైలు కిందపడి యువతి ఆత్మహత్య

బెల్లంపల్లి: పెళ్లి కావడం లేదనే మనోవ్యథతో ఓ యువతి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం బెల్లంపల్లిలో చోటుచేసుకుంది. బెల్లంపల్లి జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం... బెల్లంపల్లి టేకుల బస్తీకి చెందిన కొత్తూరు సుమలత(39) ఉదయం ఇంటి పనులు ముగించుకుని కన్నాల రైల్వేగేట్ వద్దకు వెళ్లింది. గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. పెళ్లీడు దాటి పోతున్న వివాహం కావడం లేదనే బాధతో ఆత్మహత్య చేసుకుందని జీఆర్‌పీ పోలీసులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామకృష్ణాపూర్: స్థానిక రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నాలుగు క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకుని, బియ్యం తరలిస్తున్న మల్లేష్ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

భీమిని: కన్నెపెల్లి మండల కేంద్రానికి చెందిన బాలిక (15) తప్పిపోయిందని స్థానిక ఎస్సై గంగారాం తెలిపారు. అతడి వివరాల ప్రకారం ... బాలిక ఈ నెల 14వ తేదీని ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి ఇంటికి రాకపోవడం బంధువుల, స్నేహితుల ఇళ్లల్లో వెతకగా ఆచూకీ కానరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్‌కు గాయాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి టేకుల బస్తీ కొత్త బస్టాండ్ ప్రధాన రహదారిపై మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఆర్టీసీ రిటైర్డు డ్రైవర్ మహమూద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నడుచుకుంటూ వెళ్తున్న మహమూద్‌ను కొత్త బస్టాండ్ వైపు నుంచి వేగంగా వచ్చి మోటార్ సైకిల్ ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాలకు అక్కడి నుంచి హైదరాబాద్‌కు వైద్యులు రెఫర్ చేశారు. బాధితుడి కుటుంబ సభ్యులు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు.

సోలార్ తీగకు తగిలి మహిళ మృతి


లక్ష్మి (ఫైల్)

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిరి లక్ష్మి (55) ఆదివారం పంట రక్షణకు ఏర్పాటు చేసిన సోలార్ తీగకు తగిలి మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. లక్ష్మి ఏళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతోంది. ఆదివారం తమ పంట పొలంలో కూరగాయలు కొయడానికి వెళ్లింది. కూరగాయలు కోస్తున్న క్రమంలో లక్ష్మికి మూర్ఛ రావడంతో కిందపడగా పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ తీగకు తగిలడంతో షాక్‌తో సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిర్పూర్ సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతిరాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘పాపిలాన్’ పట్టేస్తోంది..

- పోలీసుల చేతిలో లైవ్ స్కానర్
- నేరస్తులను గుర్తించేందుకు అధునాతన టెక్నాలజీ
- ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో అందుబాటులోకి..


అనుమానితుల ఫింగర్ ప్రింట్స్ సేకరిస్తున్న నైట్ పెట్రోలింగ్ పోలీసులు


ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం

మంచిర్యాలక్రైం: నేర పరిశోధనలో పోలీసులకు మరో ఆయుధం తోడైంది. ఆధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుండే మన పోలీసులు మరో కొత్త టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఈ పరిజ్ఞానంతో నేరస్తులు పోలీసుల చేతిలోనుంచి తప్పించుకోవడం అసాధ్యం. అనుమానితులను గుర్తించి సమాచారం సేకరించడానికి లైవ్‌స్కానర్లను ఉపయోగిస్తున్నారు. ఈ పరికరంతో వేలిముద్రలు సేకరించి వాటి ఆధారంగా ఆ వ్యక్తి నేర చరిత్రను అప్పటికప్పుడే తెలుసుకోవచ్చు. రూ.8లక్షలు విలువ చేసే ఈ పరికరాన్ని రష్యా నుంచి తెప్పించారు. ఇప్పటికే రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో అందుబాటులో ఉంచారు. పోలీస్‌శాఖ పాపిలాన్ ఆటోమెటిక్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టంతో పనిచేసే లైవ్ స్కానర్, మొబైల్ చెక్ డివైస్ ఎలక్ట్రానిక్ యంత్రం సహకారంతో నేరస్తుల ఆట కట్టిస్తున్నారు. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలో 10వేల మంది నేరాస్తుల వేలిముద్రలను పాపిలాన్ పరికరం ద్వారా అనుసంధానం చేశారు. 2023లో 266 దొంగతనాలు జరుగగా ఇందులో 210 దొంగతనాల ఫింగర్ ప్రింట్స్ ఆధారంగానే పట్టుకున్నారు.

నేరాస్తుల చిట్ట భయటకు...

నేరాలు, దొంగతనాలకు పాల్పడిన వ్యక్తుల వేలిముద్రలను సేకరించేందుకు రష్యా నుంచి రూ.8లక్షల విలువ చేసే అత్యాధునిక లైవ్ స్కానర్లను అన్ని పోలీస్‌స్టేషన్లకు అందించారు. ప్రస్తుతం పోలీస్ లెక్కల ప్రకారం దేశంలో 10లక్షల మంది వరకు దొంగలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇతర నేరస్తులు సైతం ఉన్నారు. దొంగలను పట్టుకునే సమయంలో కాగితాలపై వేలిముద్రలు తీసుకొని సరిచూసుకునే వరకు పుణ్యకాలం కాస్తా గడిచిపోయేది. దీనికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం విదేశాల్లో అమలవుతున్న టెక్నాలజీని మన రాష్ట్రానికి తీసుకొచ్చింది.

మొబైల్ సెక్యూరిటీ డివైస్...

ఈ పరికరం పాపిలాన్ ఆటోమెటిక్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టంకు జీపీఆర్ఎస్‌కు అనుసంధానంగా పనిచేస్తుంది. దీనిని అధికంగా భారీ సభలు సమావేశాలు, ర్యాలీల సమయంలో బ్లూ కోట్స్, పెట్రోలింగ్ పోలీసులు వినియోగిస్తారు. గతంలో నేరచరిత్ర కలిగి ఉంటే ఏ పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి నేరాలకు పాల్పడ్డాడు అనేది సంబంధిత నేరాస్తుని సమాచారం తెలిసిపోతుంది.

వెరిఫికేషన్‌లోనూ వినియోగిస్తున్నారు...

ఈ పద్ధతి ప్రస్తుతం పాస్‌పోర్ట్, ప్రభుత్వ ఉద్యోగ వెరిఫికేషన్‌లో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఫింగర్ ప్రింట్ మొబైల్ సెక్యూరిటీ చెక్ వెరిఫికేషన్ ద్వారా గతంలో నేరచరిత్ర కలిగి ఉన్నవారిని గుర్తిస్తున్నారు. ఒక వేల నేర చరిత్ర కలిగి ఉంటే వెంటనే వారి పాస్‌పోర్ట్ రద్దు, ఉద్యోగానికి అనర్హుడిగా గుర్తిస్తున్నారు.

24 గంటల్లో పట్టివేత..

కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం భరత్ కాలనీకి చెందిన అచ్చె భాగ్యలక్ష్మి ఇంట్లో 2023 సెప్టెంబర్ 30న జరిగిన దొంగతనంలో బాధితురాలి ఇంట్లో నుంచి రూ.4.67 లక్షలు నగదు చోరీకి గురైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు, ఫింగర్ ప్రింట్ నిపుణులు ఘటన స్థలానికి వెళ్లి చేతివేలు నమూనాలు సేకరించారు. 24గంటల్లో ప్రధాన నిందితుడైన కాసిపేటకు చెందిన ఏదుల దీపక్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రూ.4.67లక్షలు నగదు రికవరీ చేశారు.

పోలీసుల నుంచి తప్పించుకోలేరు..



జిల్లాలో దొంగతనాలు తగ్గించేందుకు పోలీస్‌శాఖ సరికొత్త ప్రయోగాన్ని వినియోగిస్తున్నాం. సీసీ కెమెరాల, ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా నేరస్తులను చాకచక్యంగ పట్టుకుంటున్నాం. నేరం చేసిన వాడు ఎంతటి వాడైన సరే పోలీసుల చేతిలో నుంచి తప్పించుకోలేరు. నేరాలకు పాల్పడిన వారిని త్వరగా గుర్తించేందుకు లైవ్ స్కానర్ యంత్రాంగం అందుబాటులో ఉంది. దీని ద్వారా దొంగలు త్వరగా పట్టుకోవడం జరుగుతోంది.

– ఎం. శ్రీనివాసులు, రామగుండం పోలీస్ కమిషనర్

ఫేస్‌బుక్‌లో ప్రకటనతో మోసం.. రూ.1.43 లక్షలకు టోకరా

- వాంకిడిలో సైబర్ కేసు నమోదు

వాంకిడి: తక్కువ ధరకు కారు అమ్మబడును అనే ఫేస్‌బుక్ ప్రకటనను చూసి లైక్ కొట్టిన పాపానికి ఓ యువకుడు రూ.1.43 లక్షలు మోసపోయిన ఘటన వాంకిడి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వివరాల ప్రకారం.. వాంకిడి మండలంలోని పిప్పర్ గోంది గ్రామానికి చెందిన రాథోడ్ చంద్రకాంత్ అనే యువకుడు ఈ నెల 5వ తేదీన తక్కువ ధరకు కారు అమ్మబడును అనే ఫేస్‌బుక్ ప్రకటనను చూసి లైక్ కొట్టాడు. అయితే వెంటనే 8579861593 నంబరు నుంచి రామ అగార్వల్ ఆర్మీ ఆఫీసర్ అనే పేరుతో ఫోన్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడిన చంద్రకాంత్ రూ.1.35 లక్షలకు కారు కొనేందుకు బేరం కుదుర్చుకున్నాడు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఫోన్ చేసి ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు రూ.3 వేలు పంపాలని చెప్పడంతో ఆయన ఇచ్చిన అకౌంట్ నంబరుకు ఫోన్‌పే ద్వారా పంపించాడు. 6వ తేదీన మళ్లీ ఫోన్ చేసి కంటైనర్ కిరాయి రూ.5 వేలు, ఆపై రూ.11 వేలు, రూ.11,900, తర్వాత మళ్లీ డాక్యుమెంట్ చార్జీలు అని రూ.21,500, రూ.36,999, రూ.58 వేలు, రూ.19500, రూ.18,500, రూ.2 వేలు, రూ.58వేలు ఇలా మొత్తం రై.1,43,498 పంపించాడు. మళ్లీ ఫోన్ చేసి రూ.61 వేలు పంపించాల్సిందిగా కోరగా బాధితుడు ఇక నా వద్ద డబ్బులు లేవని తెలపడంతో అటు వైపు నుంచి ఫోన్ కట్ అయింది. తర్వాత ఎంత ప్రయత్నించిన ఆ వ్యక్తికి ఫోన్ కలవకపోవడంతో మోసపోయానని గ్రహించి వాంకిడి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. బాధితుడు రాథోడ్ చంద్రకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

కొత్త గనులకు కృషి

- ఖాళీల భర్తీలో అంతర్గత ఉద్యోగులకు అవకాశం
- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్త గనులు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య తెలిపారు. ఆదివారం ఆయన నస్పూర్‌- శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో నాలుగు బొగ్గు బ్లాకులకు కేంద్రం బిడ్‌లకు ఆహ్వానించిందని, ఇందులో కేవలం కోయగూడెంకు మాత్రమే అరబిందో కంపెనీ బిడ్ సమర్పించిందన్నారు. మిగిలిన మూడు బ్లాకులను సింగరేణి దక్కించుకోవడం కోసం బిడ్‌లో పాల్గొనబోతుందని తెలిపారు. అంతే కాకుండా కోయగూడెం బ్లాక్‌ను కూడా సింగరేణికే ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం చర్చిస్తుందన్నారు. ఈ గనులను సింగరేణి చేపడితే మరో 30ఏళ్ల వరకు సంస్థ భవిష్యత్‌కు డోకా ఉండదన్నారు. సింగరేణిలో ఖాళీ పోస్టుల భర్తీ కోసం ఎక్స్‌ట్రనల్‌తో పాటు ఇంటర్నల్ ఉద్యోగులను తీసుకోవాలని యాజమాన్యంకు తెలిపామని, దీంతో వెయ్యి ఉద్యోగాల భర్తీకి కంపెనీ ముందుకు వచ్చిందన్నారు. అంతే కాకుండా ఎగ్జిక్యూటివ్ పోస్టుల్లో 60:40 నిష్పత్తిలో ఎక్స్‌ట్రనల్, ఇంటర్నల్ వారిని ఇప్పటి వరకు తీసుకుంటున్నారని, ఈ నిబంధనలను మార్చి 40:60 నిష్పత్తిలో తీసుకోవాలని కోరామన్నారు. ఇప్పటి వరకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు రావడానికి అండర్‌గ్రౌండ్ జనరల్ మజ్దూర్‌లకు మాత్రమే అవకాశం ఉండేదని, ఇప్పుడు భూగర్భంలో అన్ని కేటగిరీలకు వారికి అవకాశం కల్పించాలని కంపెనీకి లేఖ రాశామన్నారు. ఏడు నెలలుగా సీఎంపీఎఫ్ లోన్ క్లెయిమ్‌లు నిలిచిపోయాయని ఆన్‌లైన్ సేవలు మొదలైనందున త్వరలో అన్ని పునరుద్ధరణ అవుతాయన్నారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, నాయకులు కొమురయ్య, భద్రి బుచ్చయ్య, ప్రసాద్ రెడ్డి, శివకుమార్, అఫ్రోజ్ ఖాన్, కారుకూరి నగేష్, బండి సతీష్, చిలక రామచందర్ పాల్గొన్నారు.

కాల్వపై కల్వర్టు నిర్మాణం

- ఓ ప్రైవేటు వెంచర్‌కి లేని దారి ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు


కాల్వపై ఏర్పాటు చేసిన కల్వర్టు

నస్పూర్: పట్టణ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. పట్టణ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ వెంచర్లు ఏర్పాటు చేయడంతో ఆగకుండా కాలువలపై కల్వర్టులు సైతం నిర్మిస్తున్నారు. పట్టణ పరిధిలోని సీసీసీలోని రాజీవ్‌నగర్ లోపలి నుంచి సంఘం మల్లయ్య పల్లెకు వెళ్లే దారిలోని ఓ వాగుపై కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా కల్వర్టు నిర్మించారు. కాలువకు అవతలి వైపు కొన్ని నెలల క్రితం ఎలాంటి అనుమతులు లేకుండా ఓ వెంచర్ ఏర్పాటు చేశారు. ఆ వెంచర్‌కి రాజీవ్ నగర్ వైపు నుంచి ఎలాంటి దారిలేదు. వెంచర్‌లోకి వెళ్లాలంటే వాగు అడ్డుగా ఉంటుంది. ఆ వాగు దాటడానికి ఇబ్బంది ఉండడంతో కాలువపై కల్వర్టు ఏర్పాటు చేస్తే వెంచర్‌కి దారితో పాటు ప్లాట్ల ధరలు పెరుగుతాయన్న ఆపేక్షతో కొందరు వ్యక్తులు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోకుండా కాలువపై కల్వర్టు నిర్మించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ప్రజల అవసరాల దృష్ట్యా కాల్వపై కల్వర్టు ఏర్పాటు చేయాలనుకుంటే కల్వర్టు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎత్తు, వెడల్పు, నాణ్యత వంటి వాటి విషయాలను సంబంధిత అధికారులు నిర్ణయించాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండానే కల్వర్టు ఏర్పాటు చేయడంపై పలువురు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతుంటే సంబంధిత అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోడం గమనర్హం. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సతీష్‌ని సంప్రదించగా తాము ఈ మధ్య కాలంలో కాలువలపై ఎలాంటి కల్వర్టు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వలేదని ఇరిగేషన్, సంబందిత శాఖల నుంచి వివరాలు తెప్పించుకుంటామని, మా సిబ్బందిని పంపి వివరాలు తెలుసుకుని విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హైలెవెల్ వంతెనకు మోక్షమెప్పుడో..?

- వర్షాకాలంలో రాకపోకలకు తప్పని అవస్థలు
- వంతెన మంజూరైనా మొదలుకాని పనులు


వేంపల్లిలో లెవెల్ వంతెన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలో ప్రస్తుతం ఉన్న లోలెవెల్ బ్రిడ్జి హైలెవెల్ బ్రిడ్జిగా మారేందుకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ లోలెవెల్ బ్రిడ్జితో స్థానికులు ఇబ్బందులు పడాల్సిందే. వర్షాకాలంలో వాగు ఉప్పొంగి వంతెనపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. దాదాపు 50ఏళ్ల క్రితం నిర్మించిన లోలెవెల్ వంతెన కావడంతో నాలుగేళ్లుగా వర్షాకాలంలో వాగు ఉధృతితో నీటిలో మునుగుతోంది. దీంతో ఇళ్లకు కానీ వివిధ కార్యకలాపాల నిమిత్తం బయటకు వెళ్లేవారు లోలెవెల్ వంతెనపై నుంచి వాగు నీటితో ఇబ్బందులు ఎదుర్కోవడం సర్వసాధారణమైంది. లోలెవెల్ బ్రిడ్జికి అవతలివైపునా అంగన్‌వాడీ పాఠశాల, డ్వాక్రా భవనం, వృద్ధాశ్రమం, భక్తాంజనేయ సహిత శివకేశ ఆలయం, ఓ ఫంక్షన్ హాల్, పలు నివాస గృహాలు, రైతుల వ్యవసాయ భూములున్నాయి. ఇక నిత్యం వర్షాకాల సమయంలో లోలెవెల్ వంతెన మునుగుతుండడంతో అంతా తీవ్ర సమస్య ఎదుర్కొంటున్నారు. హై లెవెల్ వంతెన నిర్మాణం చేపట్టాలని చాలాసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి నోచుకోక పోగా అంతా అసంతృప్తితో ఉన్నారు. ప్రతీసారీ లోలెవెల్ వంతెన నీటిలో మునిగినప్పుడు దాదాపు అరగంటకు పైగా ప్రయాణిస్తే కానీ పనులు పూర్తికాని సందర్భాలు. గత ఏడాది అక్టోబర్‌లో హైలెవెల్ వంతెన నిర్మాణానికి పంచాయతీ రాజ్‌శాఖ డీఎంఎఫ్‌టీ కింద రూ.20లక్షల నిధులు కేటాయించగా నవంబర్‌లో అప్పటి ఎమ్మెల్యే దివాకర్‌రావు వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశాడు. హై లెవెల్ వంతెన నిర్మాణానికి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. ఆ తర్వాత అదనంగా మరో రూ.15 లక్షలు మంజూరైన ప్రభుత్వం మారడంతో సదరు కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రూ.35లక్షల బిల్లు మంజూరులో ఎక్కడ ఆటంకాలు ఎదురవుతాయోనని పనులు ప్రారంభించడానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లోలెవెల్ వంతెనను హైలెవెల్ వంతెనగా నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత ప్రజల రాకపోకల సమస్యలు తీర్చాలను కోరుకుంటున్నారు.

హై లెవెల్ వంతెన నిర్మించాలి..



వేంపల్లిలో ఆలయం వైపు వెళ్లే లోలెవెల్ వంతెన స్థానంలో హై లెవెల్ వంతెన నిర్మాణం చేపట్టి స్థానిక ప్రజల ఇబ్బందులు తీర్చాలి. గత ప్రభుత్వంలో రూ. 35 లక్షలు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా ఇకనైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేయాలి.


– వోలపు శారద, మాజీ సర్పంచ్, వేంపల్లి

గోదాంలో ధాన్యం బస్తాల చోరీ


బయటపెట్టిన ధాన్యం బస్తాలు

భీమారం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన గోదాంలో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాములు వివరాల ప్రకారం.. శనివారం రాత్రి గోదాం వద్ద టార్చిలైట్ల వెలుతురు కనిపించడంతో స్థానికులు వెంటనే అక్కడికి వెళ్లగా ఆటోరిక్షా ట్రాలీనీ తీసుకొని పారిపోయారు. సంఘటనా స్థలాన్ని స్థానికులు పరిశీలించగా గోదాం షెట్టరు తాళాలు పగులగొట్టి ఉండటమే కాకుండా 55 ధాన్యం బస్తాలు కుప్పగా బయట కనిపించాయి. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గోదాంలో నిల్వ ఉంచిన ధాన్యం సంచులు హాజీపూర్ మండల నర్సింగపూర్ గ్రామంలోని దుర్గ ఇండస్ట్రీస్‌కు చెందినవిగా గుర్తించారు. మిల్లు యజమాని దర్శనాల రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. సుమారు రూ.95వేల విలువ గల ధాన్యం చోరీకి గురైనట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఎస్సై తెలిపారు.

తనిఖీల్లో నగదు పట్టివేత


చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న డబ్బుతో పోలీసులు

సిర్పూర్(టి): మండలం మీదుగా ఉన్న అంతర్రాష్ట్ర రహదారుల్లోని చెక్‌పోస్టుల వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న మొత్తం రూ.5,26,650 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వెంకట్రావ్‌పేట్ చెక్‌పోస్టు వద్ద బొలేరో వాహనంలో నరులే భరత్ వద్ద రూ. 2,72,520 నగదుతో మహారాష్ట్రలోని రాజూరా పట్టణం నుంచి కౌటాల మండలానికి తీసుకెళ్తుండగా, అలాగే నాజీమ్ సలీం బక్ష్ చంద్రపూర్ పట్టణం నుంచి బెజ్జూర్ మండలానికి రూ.1,84,000 నగదు తరలిస్తుండగా, ఇంద్రజీత్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి చత్తీస్‌ఘడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా అతడి వాహనంలో రూ.70వేలకు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై డికొండ రమేష్ తెలిపారు.

నగదు పట్టివేత...

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఫారెస్టు చెక్‌పోస్టు ఆదివారం ఫ్లైయింగ్ స్క్వాడ్ డెప్యూటీ తహసీల్దార్ రఘునాథ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సంఘం బస్తీకి చెందిన ఓ వ్యాపారి వద్ద రూ.1,30,000 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పట్టుకున్న నగదును కాగజ్‌నగర్ రూరల్ పోలీసులకు అప్పగించారు.

రోడ్డుపైనే పశువులు..


రోడ్డుపై పశువులు

వేమనపల్లి: రాత్రి, పగలు తేడా లేకుండా మండల కేంద్రంలో పశువులు రోడ్డుపై తిష్ట వేస్తున్నాయి. గ్రామపంచాయతీ అధికారులు, ప్రత్యేక అధికారి పశువుల స్వైరవిహారంపై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణికులకు చల్లదనం పంచుతూ..


అక్కెపల్లి నుంచి చింతలపల్లికి వెళ్లే దారిలో..

చెన్నూర్‌రూరల్: వేసవికాలం ప్రారంభమైంది. ఇప్పటికే ఎండ వేడిమికి ఎటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రోజురోజుకూ ఎండలు మరింతగా ముదిరే అవకాశాలున్నాయి. కానీ మండలంలోని అక్కెపల్లి గ్రామం నుంచి చింతలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా చల్లదనాన్ని ఇస్తూ ప్రయాణికులకు ఎండ నుంచి రక్షణ కల్పిస్తున్నాయి ఈ వృక్షాలు. దీంతో వాహనదారులు కొంతసేపు ఆ చెట్ల నీడన సేద తీరుతున్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేయాలి


వినతి పత్రంఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మంచిర్యాల్‌క్రైం: జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని వాయిదా అంజామ్ (18) మృతిపై పోలీసులు విచారణ చేసి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ గురుకుల నిర్వాహకురాలు నిర్లక్ష్యంతోనే విద్యార్థిని మృతి చెందిందని ఆరోపించారు. ఈనెల 12 న ఇంటర్ పరీక్షలు రాసి అనారోగ్యానికి గురైందని, సరైన సమయంలో వైద్యం అందించడంలో గురుకుల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. విద్యార్థిని మృతిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, నాయకులు తిరుపతి, అభినవ్, అరవింద్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

లక్ష్మణచాంద: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పీచర గ్రామానికి చెందిన రుద్రారపు భీమన్న (38)కు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో శనివారం గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.